# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# మధ్య రీజినల్ బ్యూరో

పత్రికా ప్రకటన

తేది: 1-5-2018

## కస్నూర్, ఆయిపేంట అమరుల స్మృతిలో ప్రతిఘటన వారం పాటించండి
## ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఉద్యమ ప్రాంతాలలో
## మే 19-25 ప్రతిఘటన వారం పాటించండి
## మే 25 న బంద్ జయప్రదం చేయండి

**ప్రియమైన ప్రజలారా**

2018, ఎప్రిల్ చివరి వారం దండకారణ్య ఉద్యమ చరిత్రలో అత్యంత విషాద వారంగా నిలచిపోతుంది. ఆ వారంలో ఎప్రిల్ 22 నాడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర బీజాపూర్ జిల్లా హల్బి తుమిరిగుండ గ్రామ పరిసర అడవిలో మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి జిల్లా సీ-60 కమాండో పోలీసులు 40 మంది ప్రజలను, విప్లవకారులను అత్యంత క్రూరంగా హత్య చేశారు. వారిలో దక్షిణ గఢ్‌చిరోలి డివిజనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్స్ శ్రీను (విజేంద్ర), డివిజనల్ కమిటీ సభ్యులు నందూ (వాసుదేవ్ ఆత్రం), సాయినాథ్ (డోలేష్ ఆత్రం), అహెరి ఏరియా కమిటీ కార్యదర్శి లత (మహరీ వడ్డే), దళ కమాండర్ శాంతి (మంగ్లీ పద్దా) జమున, లలిత, లిమ్మీ, చంద్రకళ, రాధ, రుక్‌మతి, క్రాంతి, జానకి, సోనీ, పుష్ప, రేష్మా, అనిత, మందా, జయశీల, కార్తీక్, రాజేష్, ప్రదీప్, సందీప్, నగేష్, సన్ను, తిరుపతి, అజయ్, విజయ్, సంజయ్, శ్రీకాంత్ లతో పాటు ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు (గట్టేపల్లి గ్రామ యువకులు) ఉన్నారు. వీరందరిపై ఒకే స్థలంలో కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో అక్కడే ఐదుగురు కామ్రేడ్స్ చనిపోగా గాయపడిన 11 మంది లో నుండి ఆరుగురిని సజీవంగా తీసుకెళ్లి ఖాంద్లా-రాజారాం అడవిలో అదనపు ఎస్. పీ. మహేశ్వర రెడ్డి టీం కాల్చి చంపింది. కొన ఊపిరితో మిగిలిన వారిని కూడా హత్య చేశారు. మిగితా 24 మంది కామ్రేడ్స్ నది దాటలేక ప్రాణాలు వదిలారు. వాస్తవాలు ఇలా ఉండగా పోలీసులు అనేక కట్టు కథలల్లి ఎంతో దుష్ప్రచారం చేశారు. ఎప్రిల్ 27 నాడు బీజాపూర్ జిల్లా ఆయిపేంటలో మరో 8 మంది కామ్రేడ్స్ అసువులు బాశారు. ఎప్రిల్ 29 నాడు సుక్మా జిల్లా దూలోడు గ్రామ పరిసరాలలో ఒక మహిళ, ఒక పురుషుడు పోలీసుల బూటకపు ఎదురు కాల్పులలో ప్రాణాలు కోల్పోయారు. వారందరి స్మృతిలో మధ్య రీజియన్ బ్యూరో వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లర్పిస్తోంది. వారి ఆశయాల పరిపూర్తికై మరోసారి ప్రతిన పూనుతోంది. ప్రజల కోసం నిస్వార్థంగా తమ అమూల్యమైన ప్రాణాలను ధారపోసిన ఆ ప్రజల, విప్లవకారుల సంస్మరణలో పీ.ఎల్.జీ.ఏ. నాయకత్వంలో మే 19-25 మధ్య ప్రతిఘటనా వారం పాటించాలని సీ.ఆర్.బీ. పిలుపునిస్తోంది.

కేంద్రంలో బీ.జే.పీ. నాయకత్వంలో ఎన్.డీ.ఏ. అధికారంలోకి వచ్చిన గత నాలుగేళ్లలో అన్ని రాష్ట్రాలలోని మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలపై పోలీసు, అర్ధసైనిక బలగాలను పెద్ద సంఖ్యలో దింపి గత ఎనిమిదేళ్లుగా కొనసాగిన గ్రీన్‌హంట్ ఆపరేషన్ తదుపరి 'సమాధాన్' వ్యూహంతో అతి దూకుడుగా హంతక దాడులకు పాల్పడుతోంది. వందలాది మంది ప్రజలను, పదుల సంఖ్యలో విప్లవకారులను హత్య చేశారు. అయినప్పటికీ, విప్లవోద్యమం కొనసాగుతూ విస్తరిస్తూండడంతో ఏ యేటికాయేడు ప్రత్యేక మిషన్‌లను రూపొందించుకుంటూ సైనిక దాడులను ముమ్మరం చేస్తున్నారు. హెలికాప్టర్లను విస్తృతంగా వినియోగిస్తూ వివిధ రూపాలలో ఆకాశదాడులు చేస్తున్నారు. ఇందుకు భారత వాయుసేన కేంద్ర-తెలంగాణా-ఛత్తీస్‌గఢ్ కమాండ్ బలగాలు కలసి తెలంగాణా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులలో పూజారి కాంకేర్ లో చేసిన దాడే తాజా ఉదహరణ. మానవ రహిత విమానాలను విచ్చలవిడిగా వినియోగిస్తూ దాడులకు దిగుతున్నారు. మొత్తం అడవి ప్రాంతంలో కూడా మొబైల్ నెట్‌వర్క్‌ను పటిష్టం చేస్తున్నారు. వీటన్నింటికన్నా గ్రామాలలో నిరుద్యోగ లంపెన్ యువతను, ఉద్యమంచే శిక్షించబడిన కుటుంబాల వారిని, పోలీసు కుటుంబాలను, దుష్ట తెగ పెత్తందార్లను చేరదీసి డబ్బు కక్కుర్తితో, ఉద్యోగాల ఆశతో వారికి పూర్తి భద్రతా హామీలతో ఇన్ఫార్మర్లుగా మా ర్చుకుంటున్నారు. ప్రధానంగా వారిచ్చే సమాచారం పై ఆధారపడి దాడులు చేస్తూ పోలీసులు భారీ హత్యాకాండలకు పూనుకుంటున్నారు. 2017 మే లో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో మావోయిస్టు ప్రాంతాల పోలీసు, సైనిక, పౌర, న్యాయ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను సమావేశపరిచి విప్లవోద్యమ నిర్మూలనకై 'సమాధాన్' వ్యూహాన్ని రూపొందించారు. భారతదేశాన్ని 2022 లోపు మావోయిస్టు రహిత దేశంగా మారుస్తామని గడువు నిర్ణయించారు. వర్తమాన ముమ్మర దాడులన్నీ దాని ఫలితమే, ఈ హంతక దాడులను ఖండించి, వాటిని ప్రతిఘటిస్తూ విప్లవోద్యమానికి పూర్తి అండగా నిలచి దానిని కాపాడుకోవలసిందిగా ప్రజలను మా పార్టీ కోరుతుంది.

ఉద్యమ ప్రాంతాలపై పెరుగుతున్న దాడులకు, హత్యాకాండకు, జైలు పాలైనవారికి విధిస్తున్న కఠిన, దీర్ఘకాల శిక్షలకూ ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభానికీ విడదీయరాని సంబంధం వుంది. దేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ కొనసాగుతున్న సంక్షోభం నుండి దోపిడీ పాలకవర్గాలు గట్టెక్కడానికి మన దేశ ప్రాకృతిక వనరులను భారీగా కొల్లగొట్టుకపోవడానికి ఆగమేఘాల మీదా వేగిరపడుతున్నాయి. కేంద్ర, అన్ని

రాష్ట్రాల ప్రభుత్వాలు పోటీ పడుతూ నేతలు దేశ వనరుల అమ్మకానికి దేశ, విదేశాలు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఆయా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో, బహుళ జాతి కార్పోరేషన్‌లతో పదుల కొద్దీ పరస్పర అవగాహన పత్రాలు కుదుర్చుకుంటున్నారు. వారికి హామీల మీదా హామీలిస్తూ సత్వర ఫలితాలకై మౌలిక సదుపాయాల రూపకల్పనలో మునిగిపోయారు. వాటి పరిపూర్తికై ఖాకీలను వినియోగిస్తూ ప్రజలపై తీవ్ర దాడులకు పాల్పడుతున్నారు. దోపిడీ పాలక వర్గాలు తాము రాసుకున్న అన్ని చట్టాలను తుంగలో తొక్కుతూ పౌర, ప్రజాస్వామ్య హక్కులను హననం చేస్తున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలో పెసా, గ్రామ సభలను అడ్రస్ లేకుండా చేస్తున్నారు. మరోవైపు తేనెలొలికే మాటలతో అభివృద్ధి..... అభివృద్ధి అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. ఇందులో మోదీ మరియు రమణ్‌సింగ్, దేవేంద్ర ఫడ్నవీస్, రఘువరదాస్, చంద్రబాబు నాయుడు, పినరాయి విజయన్, నవీన్ పట్నాయక్, చంద్రశేఖరరావులు ముందున్నారు. దేశంలో చుక్కలంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, విపరీతంగా పెరిగిపోతున్న నిరుద్యోగం, రైతాంగ ఆత్మహత్యలు, ఆకలి చావులు, అత్యాచారాలు, అవినీతి కుంభకోణాలు ఎన్ని సమస్యలు ఎంత పెరిగిపోతున్నా పాలకులకు మాత్రం దోపిడీ వర్గాల, సంపన్న కుటుంబాల అభివృద్ధి ధ్యాసే తప్ప ప్రజల బాగోగుల పట్టింపే లేదు.

పై జీవన్మరణ సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే గోరుచుట్టుపై రోకటి పోటులా దేశంలో హిందుత్వ శక్తుల దాడులు పెరిగిపోతున్నాయి. గత నాలుగేళ్లలో వందల సంఖ్యలో హిందుత్వ దాడులు జరిగి అనేక మంది ముస్లిం, దళిత, ఆదివాసీ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆస్తులు నష్టపోయారు. సమాజంలోని అన్ని సెక్షన్‌ల ప్రజలు హిందుత్వ వేదింపులకు గురవుతున్నారు. అయినప్పటికీ, పాలకులకు కావలసింది మాత్రం వారి ఓట్లు తప్ప వారి సమస్యల పరిష్కారం ఎంత మాత్రం కాదు.

దేశంలో పెరుగుతున్న ప్రజా చైతన్యం, ప్రజా పోరాటాలు, ప్రజాస్వామిక ఉద్యమాలతో పాటు విప్లవోద్యమం వారి దోపిడీ ఆటలు వారనుకుంటున్నట్టుగా సాగనివ్వడం లేదు. ప్రజలు గతం కన్నా చాలా సమరశీలంగా పోరాడుతున్నారు. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ప్రజలకు అండగా నిల్చి దృఢంగా, అంకితభావంతో పోరాడుతోంది. దోపిడీ పాలక వర్గాల ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ మా పార్టీ ఎప్పటికప్పుడు ప్రజలలో ఎండగడుతూ ప్రజలను సంఘటితపరుస్తూ పోరాటాలలోకి సమీకరిస్తోంది. ముఖ్యంగా విప్లవోద్యమ ప్రాంతాలలో ప్రజల ప్రత్యామ్నాయ ప్రభుత్వాలను నిర్మిస్తూ దేశంలో నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికై త్యాగ నిరతితో, సాహసోపేతంగా పోరాడుతోంది.

ఈనాడు దేశంలోని పీడిత తాడిత ప్రజలకు మా పార్టీపై విశ్వాసం పెరుగుతోంది. అందుకే మా పార్టీని దోపిడీ పాలక వర్గాలు అతి పెద్ద ప్రమాదకర శక్తిగా భావిస్తోన్నాయి. ప్రజల మౌలిక సమస్యలను 70 ఏండ్లయినా పరిష్కరించలేకపోతున్న ప్రభుత్వాలు భౌతికంగా మావోయిస్టు విప్లవకారులను అంతమొందించడానికి పూనుకుంటున్నాయి. సమాజంలో దోపిడీ పీడనలున్నంతకాలం విప్లవోద్యమం వివిధ రూపాలలో కొనసాగి తీరుతుంది. ప్రజలు ఎంతటి అసమాన త్యాగాలకైనా వెనుకాడరు. ఇది చారిత్రక సత్యం. పోలీసుల డబ్బు కక్కుర్తితో విప్లవకారుల ప్రాణాలకు ముప్పు తలపెడుతున్న ద్రోహులను ప్రజలు, విప్లవోద్యమం ఎన్నటికీ క్షమించదు. ఈ సందర్భంగా కస్నూర్, ఆయిపేంట లలో జరిగిన హత్యలకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో వీధులలోకి వచ్చి తమ నిరసనలు తెలపాల్సిందిగా విప్లవ ప్రజలకు పిలుపునిస్తున్నాం.

ప్రజాస్వామిక వాదులారా, పాత్రికేయులారా, హక్కుల కార్యకర్తలారా, విద్యార్థి యువజనులారా

2016 అక్టోబర్‌లో ఒడిశాలోని రామగూడలో 31 మంది కామ్రేడ్స్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్ పోలీసులు హత్య చేసినపుడు మీరంతా యుద్ధ ప్రాతిపదికపై కదలి వాస్తవాలను ప్రపంచం ముందుంచారు. ఈనాడు అంతకు మించిన హత్యలు జరుగుతున్నాయి. వీటిపై మీరు తక్షణం నిజ నిర్ధారణకు పూనుకుంటారనీ, దోషులను శిక్షించే న్యాయ పోరాటంలో ముందుండాలనీ మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తోంది. మీ పైన కూడా ఫాసిస్టు దాడులు జరుగుతున్నాయి, మిమ్మల్ని అరెస్టులు చేస్తున్నారు, బెయిల్‌లు ఇవ్వకుండా దీర్ఘకాలం కటకటాల వెనక వుంచుతున్నారు. మీ పై కూడా దాడులు చేస్తూ మిమ్మల్ని హత్య చేస్తూన్నారు. అయినప్పటికీ మీరు ధైర్యంగా ప్రజల వెంటా, ప్రజా ఉద్యమాల వెంటా దృఢంగా నిలబడుతారనీ మా పార్టీ పూర్తిగా మీ పై విశ్వాసంతో వుంది.

- ✶ కస్నూర్, ఆయిపేంట అమరుల స్మృతిలో మే 19-25 ప్రతిఘటన వారం పాటించండి. మే 25 బందు పాటించండి.
- ✶ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను బహిర్గతం చేయండి.
- ✶ విప్లవ, జాతిముక్తి, ప్రజాస్వామిక ఉద్యమాలపై కొనసాగుతున్న రాజ్యహింసను ఖండించండి.
- ✶ కస్నూర్, ఆయిపేంట హత్యల వెనక గల వాస్తవాలను వెలికి తీసి హంతకులను శిక్షించండి.
- ✶ కస్నూర్, ఆయిపేంట అమరుల స్మృతిలో సభలు, సమావేశాలు జరిపి వారి త్యాగాలను ఎత్తిపట్టండి. వారి ఆశయాల సాధనకై ప్రతిన పూనండి.

**విప్లవాభివందనాలతో,**

**ప్రతాప్,**

**అధికార ప్రతినిధి, మధ్య రీజనల్ బ్యూరో,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు),**

**తేది: ప్రపంచ కార్మిక దినం, 2018**